## క్లుప్తంగా

### శరవేగంగా హెచ్ కొట్టాల రహదారి పనులు



హెచ్ కొట్టాల గ్రామం వరకు నాల్గులైన్ల రహదారిలో భాగంగా తారు రోడ్డు వేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: పట్టణంలోని డోన్ క్రాస్ రోడ్డు నుంచి హెచ్ కొట్టాల క్రాస్ రోడ్డు వరకు 3.5 కిలోమీటర్ల మేర నాలుగులైన్ల రహదారి నిర్మాణాని కి రూ.8 కోట్లు మంజూరయ్యాయి. సంబంధి త కంట్రాక్టర్ చేపట్టిన పనులు శరవేగంగా సా గుతున్నాయి.రహదారి పనులు దాదాపు చివరి దశకు చేరుకున్నాయి. బేతంచెర్ల నుంచి హెచ్ కొట్టాల వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న పరిశ్రమలకు రాకపోకలకు సౌకర్యంగా మారనుంది.

### 23న మండల మీట్

సంజామల: మండల కేంద్రం సంజామలలోని స్త్రీశక్తి భవనంలో ఈనెల 23న ఎంపీపీ పోచారమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నాగకుమార్ బుధవారం తెలిపారు. విద్య, వైద్యం, తాగునీరు తదితర అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. ఆయా శాఖల మండల స్థాయి అధికారులు తమ ప్రగతి నివేదికలతో సమావేశానికి తప్పక రావాలన్నారు. అదేవిధంగా సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సమావేశానికి హాజరు కావాలని సూచించారు.

### మద్యం మత్తులో వీరంగం

కోవెలకుంట్ల: స్థానిక అయ్యప్పస్వామి దేవాలయ వీధిలో బుధవారం ఓ వ్యక్తి మద్యం మత్తులో వీరంగం సృష్టించాడు. అతిగా మద్యం సేవించి ప్రధాన వీధిలో తిరుగుతూ పలువురిపై దాడి చేయడంతోపాటు ద్విచక్ర వాహనాలను ధ్వంసం చేసే ప్రయత్నం చేశాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు.

### సబ్సిడీపై జీలుగ విత్తనాలు మంజూరు

కొలిమిగుండ్ల: 2023–24 సంవత్సరానికి గాను సబ్సిడీపై జీలుగలు, పిల్లిపెసర విత్తనాలను ప్రభుత్వం చేసినట్లు ఏఓ పవన్‌కుమార్ బుధవారం తెలిపారు. మండలానికి జీలుగలు 30 క్వింటాళ్లు, పిల్లిపెసర 10 క్వింటాళ్లు వచ్చాయన్నారు. జీలుగలు పూర్తి ధర రూ.7900 ఉండగా 50 శాతం సబ్సిడీతో రైతు వాటా కింద రూ.3950 అందించాల్సి ఉంటుందన్నారు. అలాగే పిల్లిపెసర క్వింటా పూర్తి ధర రూ.9700 ఉండగా సబ్సిడీపై రూ.4850కి అందజేస్తున్నామన్నారు. ఒక్కో రైతుకు ఐదు ఎకరాల వరకు విత్తనాలు పంపిణీ చేస్తామన్నారు. ఈ విత్తనాలు కావాల్సిన రైతులు ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

### బేతంచెర్ల కో- పీహెచ్‌సీ మంజూరు



ఎంపీపీ, నగర పంచాయతీ చైర్మన్‌తో కో పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది

బేతంచెర్ల: మండల కేంద్రమైన బేతంచెర్ల పట్టణానికి నూతనంగా ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో కో- పీహెచ్‌సీ మంజూరైంది.కో పీహెచ్‌సీకి వైద్యులు మౌనిక, నెహతాబ్‌ను నియమించారు. బుధవారం ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డిని వైద్యులు, సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిశారు. మీ దగ్గరకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకరావాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ జ్యోతి, హెల్త్ అసిస్టెంట్ రామాంజనేయులు, 104 సిబ్బంది రవి, మదన మోహన్ పాల్గొన్నారు.

### దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

బేతంచెర్ల: దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం కర్నూలు కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని మండల స్ఫూర్తి దివ్యాంగుల స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు మద్దిలేటి,రాముడుపిలుపునిచ్చారు.బుధవా రం స్థానికంగా ఏర్పాటు చేసిన దివ్యాంగుల స మావేశంలో వారు మాట్లాడారు. నెలకు రూ. 6వేలపింఛన్ ఇవ్వాలని, ప్రతి దివ్యాంగునికి త్రీ వీలర్ మోటార్ సైకిలు ఇవ్వాలని, నామినేటెడ్ పోస్టులలో రిజర్వేషన్ కల్పించాలని కోరారు.

### 20న జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు

సంజామల: మండలంలోని ఆకుమల్ల గ్రామంలో వేసవి సెలవుల నేపథ్యంలో ఈనెల 20న జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కిరణ్, సునీల్ బుధవారం తెలిపారు. క్రికెట్ జట్లు 19వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. విజేత జట్లకు వరుసగా రూ.15వేలు, రూ.10వేల చొప్పున బహుమతి అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.

## చెరువుపల్లె - ప్రగతి బాట!



రూ.17 లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్‌క్లినిక్ భవనం

బనగానపల్లెరూరల్: మండల పరిధిలోని చెరువుపల్లెలో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవతో దాదాపు రూ.1.36 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడంతో ఆ గ్రామం ప్రగతి బాట పట్టింది. ఇప్పటికే రూ.30లక్షలతో మెయిన్ బజారు, బలిజపేట వీధుల్లో సీసీ రోడ్లు, రూ.17లక్షలతో హెల్త్ క్లినిక్ భవన నిర్మాణం పూర్తయ్యాయి. జల్‌జీవన్ పథకం కింద ఇంటింటికీ తాగునీటిని సరఫరా చేసేందుకు రూ.28,16 లక్షలతో 40వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ఓహెచ్‌ఆర్ నిర్మాణం పూర్తయ్యింది. మరో రూ.40లక్షలతో సచివాలయ భవన నిర్మాణం, రూ.21లక్షలతో రైతు భరోసా కేంద్ర భవన నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. అంగన్‌వాడీ భవనం మరమ్మతులకు మరో రూ.4.50 లక్షల నిధులు మంజూరయ్యాయి. పట్టణాన్ని తలపించేలా హెల్త్ క్లినిక్, సచివాలయ కార్యాలయం, రైతు భరోసా భవనాలు ఏర్పాటు కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు గ్రామస్తులు.



రూ.40 లక్షలతో ... సచివాలయ భవన నిర్మాణ పనులు



జల్‌జీవన్ పథకం కింద రూ.28.16 లక్షలతో నిర్మించిన ఓహెచ్‌ఆర్ ట్యాంక్

## క్రమశిక్షణ...అత్యుత్తమ బోధన



కనకాద్రిపల్లెలో విద్యార్థికి అడ్మిషన్ అందజేస్తున్న అధ్యాపకులు

- ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం
- ఇళ్ల వద్దకు వెళ్లి అడ్మిషన్‌లు చేయిస్తున్న అధ్యాపకులు

కొలిమిగుండ్ల: జూనియర్ కళాశాలలను ప్రభుత్వం నాడు-నేడు కింద అభివృద్ధి చేస్తుండడంతో విద్యా ప్రమాణాలు మెరుగుపడుతున్నాయి. అధ్యాపకుల అంకితభావం, క్రమశిక్షణతో కూడిన బోధన సాగించడం ద్వారా ఇంటర్ ఫలితాల్లో సైతం కార్పొరేట్ కళాశాలలను మించిపోతున్నాయి. లక్షల ఫీజులు వెచ్చించినా కార్పొరేట్ కాలేజీల్లో లేని వసతులు ప్రభుత్వ కళాశాలల్లో ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్‌లో ప్రవేశం కోసం దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. కొలిమిగుండ్ల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపక బృందం ప్రత్యేక శ్రద్ధ వల్ల విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తున్నారు. ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో ఉమ్మడి జిల్లాలోని 31 ప్రభుత్వ కళాశాలల్లో మొదటి సంవత్సరంలో కొలిమిగుండ్ల కాలేజీ పాస్ పర్సంటేజీలో మొదటి స్థానంలో నిలిచింది. మొత్తం 27 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 17 ఉత్తీర్ణత సాధించడంతో 58.62 శాతం వచ్చింది. కాలేజీలోనే పరీక్షలు నిర్వహణ జరుగుతున్నప్పటికీ ఖచ్చితత్వంతో వ్యవహరిస్తున్నారు. ఈవిద్యాసంవత్సరం నుంచి ఇంగ్లిష్ మీడియం ప్రారంభిస్తున్నారు.

**గ్రామాల్లో ప్రచారం:** అధ్యాపకులు అంకిత భావంతో పని చేస్తు కళాశాల అభివృద్ధికి దోహదపడుతున్నారు. ఇటీవలనే పదో తరగతి ఫలితాలు విడుదల కావడంతో అడ్మిషన్ల కోసం గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. అధ్యాపకుల బృందం గ్రామాలకు వెళ్లి తల్లితండ్రులతో చర్చించి కళాశాల గురించి వివరిస్తున్నారు. అమ్మాయిలను పది తర్వాత చదువు మాన్పించకుండా తల్లిదండ్రులకు విద్య ప్రాముఖ్యతను వివరిస్తూ చైతన్య పరుస్తున్నారు. అన్ని విధాలా వారిని ఒప్పించి నేరుగా అడ్మిషన్ తీసుకుంటున్నారు. ఇప్పటికే పదికిపైగానే అడ్మిషన్‌లు వచ్చాయని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు.

## అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాల బ్రోచర్ లబ్ధిదారులకు అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్యాపిలి: అర్హతను ప్రామాణికంగా తీసుకుని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను వర్తింపజేస్తున్నామని ఎంపీపీ గోకుల్‌లక్ష్మి, మార్కెట్‌యార్డు చైర్మన్ రాజా నారాయణమూర్తి, వైఎస్సార్ సీపీ నాయకులు రామచంద్రారెడ్డి, కమతం భాస్కర్ రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని పెద్దపొదిళ్ల, చిన్నపొదిళ్ల గ్రామాల్లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ బొర్రా మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల బ్రోచర్‌ను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు తమ పార్టీకి చెందిన వారికి మాత్రమే సంక్షేమ పథకాలను అమలు చేసే పరిస్థితి ఉండేదన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఈ విధానానికి స్వస్తి పలికి పార్టీలకు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. చివరకు అధికార పార్టీకి చెందిన నాయకుల ప్రమేయం లేకుండా సచివాలయాలకు వెళ్లి ప్రజలు నేరుగా పథకాలకు దరఖాస్తు చేసుకునే విధానాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, జెడ్పీటీసీ మాజీ సభ్యులు దిలీప్ చక్రవర్తి, ఏఓ షేక్షావలి, ఈఓఆర్డీ బాలకృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

## రాయలసీమకు న్యాయం చేయాలి



సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్న జేఏసీ నాయకులు

కోవెలకుంట్ల: సాగునీరు, నిధుల కేటాయింపులో సీమకు న్యాయం చేయాలని రాయలసీమ జాయింట్ యాక్షన్ కమిటీ కో ఆర్డినేటర్ కామని వేణుగోపాల్‌రెడ్డి కోరారు. నీళ్లు, నిధుల విడుదలలో సమన్యాయం చేయాలని కోరుతూ బుధవారం పట్టణంలో ప్రజల నుంచి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాల నుంచి సాగునీటి విషయంలో రాయలసీమ జిల్లాలకు అన్యాయం జరుగుతోందన్నారు. ఎస్సార్బీసీ, కేసీకెనాల్‌కు కేటాయింపులే తప్పా పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేయడం లేదన్నారు. కార్యక్రమంలో ఆ కమిటీ నాయకులు డాక్టర్ పేరాశ్రీధర్‌రెడ్డి, కరీంబాషా, అమర్‌నాథ్‌రెడ్డి, అప్పపోగు వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రంగనాయుడు

బేతంచెర్ల: మండల పరిధిలోని సిమెంట్ నగర్ గ్రామంలో ఉన్న పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీలో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగ నాయుడు, ఏఐటీయూసీ జిల్లా కార్యాదర్శి సుంకయ్య కోరారు. బుధవారం మండల పరిధిలోని సిమెంట్ నగర్ గ్రామంలో సీపీఐ సమరభేరి జీపు జాతను మండల కార్యదర్శి భార్గవ్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. మండల సమగ్ర అభివృద్ధికి సమరశీల పోరాటాలకు తీర్మానం చేశారు. హక్కుల సాధనకు ఐకమత్యంగా ఉద్యమించాలని రంగనాయుడు పిలుపునిచ్చారు.

### గుర్తు తెలియన వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

డోన్ టౌన్: చిన్నమల్కాపురం డోన్ రైల్వే స్టేషన్ల మధ్య గుర్తు తెలియని సుమారు 30 నుంచి 35ఏళ్ల వ్యక్తి రైలు నుంచి పడి మృతి చెందినట్లు కర్నూలు రైల్వే ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ శ్రీనివాసరావు బుధవారం రాత్రి తెలిపారు. ట్రాక్‌మెన్ సమాచారం మేరకు గుర్తు తెలియని వ్యక్తి శరీరంపై జీన్స్ పాంట్, తెల్ల చుక్కల అంగీ ఉందన్నారు. సమాచారం తెలిసిన వ్యక్తులు స్థానిక రైల్వే పోలీసులను సంప్రదించాలని సూచించారు. నిద్ర మత్తులో ట్రైన్ నుంచి ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెంది ఉండవచ్చు అని తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

డోన్ టౌన్ : పట్టణ సమీపంలోని యు.కొత్తపల్లె జాతీయ రహదారి ఫ్లైఓవర్ బ్రిడ్జిపై (భారత్ దాబా సమీపంలో)బైకు అదుపు తప్పి రోడ్డు ప్రమాదానికి గురైన సంఘటనలో యువకుడు రాజశేఖర్(18) మృతి చెందాడు. మెట్ట మంజునాథ్ అనే వ్యక్తికి గాయాలు అయ్యాయి. వీరిద్దరు ప్యాపిలి మండలం వెంగళాంపల్లె గ్రామానికి చెందిన వ్యక్తులు. బైకుపై డోన్‌కు వస్తుండగా అదుపు తప్పి ఫ్లైఓవర్ బ్రిడ్జిని ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. వెంగళాంపల్లె గ్రామానికి చెందిన బక్షాల లక్ష్మయ్య, పుష్పలత మూడవ కుమారుడు రాజశేఖర్ గౌండా పని చేస్తు జీవించేవాడు. అదే గ్రామానికి చెందిన వెంకటరమణ కిష్టమ్మ దంపతుల కుమారుడు మంజునాథ్‌తో కలిసి రాజశేఖర్ బైకుపై వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. గాయపడిన మంజునాథ్‌ను రూరల్ పోలీసు స్టేషన్ పెట్రోలింగ్ వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



దివ్యాంగురాలికి సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మీ

అవుకు: పేదల ఆర్థికాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. అర్హతే ప్రామాణికంగా కులమతాలు, పార్టీలు, వర్గాలకు అతీతంగా పేదలందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని తెలిపారు. అవుకు మండల పరిధిలోని సంగపట్నం గ్రామంలో రెండవ రోజు బుధవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మీ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, అధికారులతో కలిసి ఎమ్మెల్యే గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లిన కాటసాని... అమ్మా బాగున్నావా.. అక్కా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా.. అంటూ ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. నాలుగేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన లబ్ధి వివరాలను వివరిస్తూ బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. బుక్‌లెట్‌లోని వివరాల మేరకు సంక్షేమ పథకాల అందాయా లేదా అని లబ్ధిదారులతో ఆరా తీశారు. సమీపంలో రోడ్డును ఆనుకొని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చాలా కిందకు ఉందని, పిల్లలకు ప్రమాదం జరిగే పరిస్థితులు ఉన్నాయని ఎస్సీ కాలనీ వాసులు విన్నవించగా దిమ్మెకట్టి ఎత్తు పెంచాలని విద్యుత్‌శాఖకు ఎమ్మెల్యే సూచించారు. అదేవిధంగా హుస్సేన్ రెడ్డి కాలనీలో నాల్గవ బజారుకు తాగునీరు అందడం లేదని స్థానికులు తెలుపగా తాగునీటి సమస్యపై నిర్లక్ష్యం తగదని, వెంటనే పరిష్కారించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పల్లెల అభివృద్ధికి రూ. కోట్లు ఖర్చు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందాలంటే తప్పనిసరిగా వారి పార్టీకి సంబంధించినవారో, వర్గానికి చెందినవారో అయి ఉంటేనే అందేవని, ప్రస్తుతం సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా కుల, మతాలు, పార్టీలు, వర్గాలు అనే బేధాలు లేకుండా అర్హతే ప్రామాణికంగా పేదలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నామని తెలిపారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని ప్రజలకు పిలుపునిచ్చారు.

### సంగపట్నం అభివృద్ధికి కృషి చేస్తా..

సంగపట్నం గ్రామాభివృద్ధికి తనవంతు కృషి తప్పకుండా చేస్తానని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హామీ ఇచ్చారు. గ్రామంలో రూ.74.2లక్షలతో గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్ సెంటర్ భవనాలను నిర్మించామన్నారు. అలాగే రూ.3లక్షలతో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్, రూ.26లక్షలతో కాంపౌండ్ వాల్, నాడు-నేడు మొదటి ఫేస్ కింద దాదాపు రూ.24లక్షలతో పాఠశాలలో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. అదేవిధంగా జిల్లా పరిషత్ పాఠశాలలో అదనపు తరగతి గదులకు రూ.62లక్షలు, నాడే-నేడు రెండవ ఫేస్ కింద రూ.42లక్షలు మంజూరయ్యాయని, పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అజాంఖాన్, డిప్యూటీ తహసీల్దార్ పోతుల ప్రసాద్ రావు, ఈఓఆర్డీ రామకృష్ణవేణి, ఏఈ గౌస్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ నాగసుంకమ్మ, ఏపీఎం విజగోపాల్, అవుకు మండల సచివాలయ కన్వీనర్ తల్లం సుబ్రహ్మణ్యం, వైఎస్సార్‌సీపీ నాయకులు చల్లా చరణ్ రెడ్డి, ముక్కమళ్ల పుల్లారెడ్డి, చందాల ఆంజనేయులు, దస్తగిరి నాయుడు, లింగన్న, పెద్ద కంబయ్య, కురుమయ్య, రాముడు, బాలాంజనేయులు, ఇమాంసా, తప్పెట పెద్ద రాముడు, చిన్న రాముడు, నాగరాజు, పురుషోత్తం నాయుడు,గిరి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

### పర్యావరణాన్ని కాపాడుకుందాం

ప్యాపిలి: మొక్కలు విరివిగా నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని సోషల్ ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ కిరణ్‌కుమార్, సర్పంచ్ కరణం మదన్ మోహన్ అన్నారు. మండల పరిధిలోని ఏనుగుమర్రి గ్రామంలో అటవీశాఖ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగం కారణంగా మానవాళితో పాటు జంతువుల ఆరోగ్యానికి కూడా హాని జరుగుతోందన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని మానుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్, నీరు అవసరాలకు మించి వాడుకోవడం ద్వారా భవిష్యత్ తరాలు ఇబ్బంది పడతాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### కాలం చెల్లిన శీతలపానీయాల విక్రయాలు

డోన్ టౌన్: పట్టణంలో కొన్ని రోజులుగా కాలం చెల్లిన కూల్‌డ్రింక్స్ అమ్ముతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. వివిధ రకాల కంపెనీ బాటిళ్లు, ప్యాకెట్లను ప్రజలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాలం చెల్లిన కూల్ డ్రింక్స్ తాగి ఎదైన అనారోగ్యం పాలైతే ఎవ్వరు బాధ్యత అని ప్రశ్నిస్తున్నారు ప్రజలు. ఈ విషయంపై అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కూర్మనాయకులు దృష్టికి తీసుకెళ్లగా షాపుల లోకేషన్లు షేర్ చేస్తే దాడులు చేస్తామని తెలిపారు.

### నేడు డోన్‌కు మందకృష్ణ మాదిగ

డోన్ టౌన్: పట్టణంలోని మార్కెట్ యార్డు ఎదురుగా ఎమ్మార్పీస్, ఎంఎస్ఎఫ్, వీహెచ్‌పీఎస్ తోపాటు అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో గురువారం డోన్‌లో నిర్వహించే మహాసభకు మందకృష్ణ మాదిగ హాజరవుతారని ఎమ్మార్పీస్ జాతీయ అధికార ప్రతినిధి గుండాల ఈశ్వరయ్య మాదిగ తెలిపారు. మహా సభను జయప్రదం చేయాలని కోరుతూ నాయకులు బుధవారం ఉడుములపాడు గ్రామంలో పర్యటించి జన సమీకరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మహాసభల్లో ఎస్సీ వర్గీకరణపై నిర్ణయం తీసుకుని భవిష్యత్ కార్యచరణ ప్రణాళిక రూపొందించనున్నామన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కో కన్వీనర్ ఎద్దుపెంట కేశవయ్య మాదిగ, నాయకులు రామాంజనేయులు, పులిపెద్దయ్య, దేవదాసు, వెంకటేశ్వర్లు, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

## లారీ ఢీకొని మహిళలకు తీవ్రగాయాలు

బనగానపల్లెరూరల్: మండలంలోని యనకండ్ల గ్రామం వద్ద మనీషా అనే మహిళలను లారీ ఢీకొట్టడంతో తీవ్రగాయాలపాలైన సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. ఈ మేరకు బుధవారం బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మనీషా కాలినడకన ఇంటికి వెళ్తుండగా తాడిపత్రి నుంచి స్లాగ్‌లోడ్‌తో జయజ్యోతి సిమెంట్ పరిశ్రమ వద్దకు వస్తున్న ఏపీ 39 టీపీ 5911 నంబరు లారీ అతివేగంగా వచ్చి ఢీకొట్టి ఆపకుండా వెళ్లిపోతుండగా యువకులు మోటార్ సైకిళ్లపై వెళ్లి డ్రైవరు అదుపులోకి తీసుకున్నారు. బాధిత మహిళలను బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లగా అక్కడి వైద్యులు వెంటనే కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు రెఫార్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి బాలకృష్ణ, సీపీఐ మండల కార్యదర్శి సుబ్బారెడ్డి మాట్లాడుతూ జయ జ్యోతి సిమెంట్ కంపెనీకి చెందిన లారీల డ్రైవర్లు నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. మనీషాను ప్రమాదానికి కారణమైన లారీ యాజమాన్యంతో పాటు జయజ్యోతి సిమెంట్ పరిశ్రమ ప్రతినిధులు ఆదుకోవాలని, కంపెనీలో ఉద్యోగం, నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు ఎస్ఐ రామిరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఉద్యానవన పంటల సాగుకు ప్రోత్సాహం



సమావేశంలో మాట్లాడుతున్న సాంబశివరావు

కోవెలకుంట్ల: మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యానవన పంటల సాగుకు ప్రోత్సాహం కల్పిస్తున్నట్లు ఏపీడీ సాంబశివరావు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలానికి వంద ఎకరాల్లో ఉద్యానవన పంటల సాగుకు లక్ష్యం నిర్దేశించామన్నారు. మామిడి, చీని, నిమ్మ, సపోట, జామ తదితర పంటలు సాగుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహబూబ్‌దౌలా,ఏపీఓ శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో యువతిపై అత్యాచారం

- డోన్‌కు చెందిన యువకుడిపై కేసు నమోదు



దామోదర్‌రెడ్డి (నిందితుడు )

డోన్: ఓ యువతిని మాయ మాటలతో లోబర్చుకుని అత్యాచారం, హత్యాయత్నానికి పాల్పడిన ఘటనలో నంద్యాల జిల్లా డోన్ మండలం సోంపురం గ్రామానికి చెందిన యువకుడు నిందితునిగా ఉన్న విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ నగరంలోని గచ్చిబౌలి పోలీసు స్టేషన్ పరిధిలో ఇటీవల ఈ ఘటన చోటు చేసుకుంది. డోన్ పట్టణం టీచర్స్ కాలనీకి చెందిన ఉడుములపాటి దామోదర్‌రెడ్డిని ఈ కేసులో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. గచ్చిబౌలి ప్రాంతానికి చెందిన ఓ యువతి ప్రైవేట్ జాబ్ చేస్తోంది. తన ఆఫీసు స్నేహితులతో కలిసి గది అద్దెకు తీసుకుని నివసిస్తుంది. ఈ క్రమంలో గత ఫిబ్రవరిలో తన దూరపు బంధువు డోన్ మండలం సోంపురం గ్రామానికి చెందిన దామోదర్‌రెడ్డితో ఆ యువతితో పెళ్లి చూపులు జరిగాయి. ఇతనికి తల్లిదండ్రులు లేక పోవడంతో మేనత్త, బాబాయ్ పెంచారు. ఒక రోజు దామోదర్ రెడ్డి హైదరాబాద్‌లోని యువతి ఇంటికి ఎవరూ లేని సమయంలో వెళ్లి బలవంతంగా ఫొటోలు, వీడియోలు తీశాడు. అనంతరం వాటిని వీడియో కాల్ చేసి చూపుతూ బ్లాక్ మెయిల్ పాల్పడి లోబర్చుకున్నాడు. ఇక భరించలేక విషయాన్ని అతని కుటుంబ సభ్యులకు తెలియజేసింది యువతి. అతని మూలంగా గర్భవతిని అయ్యానని, అబార్షన్ అయ్యేందుకు బలవంతంగా కొన్ని మాత్రలు మింగించాడని వాపోయింది. ఈ విషయం తెలుసుకున్న దామోదర్‌రెడ్డి నిత్యం ఆ యువతికి ఫోన్ చేసి వేధించడం మొదలుపెట్టాడు. ఇంటికే వెళ్లి కత్తితో హత్య చేయబోయాడు. దీంతో యువతి గచ్చిబౌలి పోలీసులను ఆశ్రయించింది. దామోదర్‌రెడ్డితో పాటు అతని బంధువులపై అత్యాచారం, హత్యాయత్నం కేసులు పెట్టింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు అతని సెల్‌ఫోన్ ఆధారంగా అన్న నరేష్ ఇంటిలో అదుపులోకి తీసుకుని జడ్జి ఎదుట హాజరుపర్చగా రిమాండ్‌కు ఆదేశించారు. పరారీలో ఉన్న నిందితుడి బంధువుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

## ప్రారంభోత్సవాలను విజయవంతం చేయాలి

కోవెలకుంట్ల: మేజర్ గ్రామ పంచాయతీ కోవెలకుంట్ల పరిధిలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో పట్టణంలోని ఐదు గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలోని సాయినగర్, పోలీస్‌సర్కిల్, గాంధీనగర్, కానాల అంకిరెడ్డికాలనీ, సుంకులమ్మ వీధి, తదితర ప్రాంతాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి పైప్ లైన్ పనులకు ఈ నెల 23వ తేదీన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభోత్సవం చేస్తారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఈఓ బాలాంజనేయులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.